కథా కౌముది

# ఆత్మారామం

రాధిక నోరి

టల్లాసీ, ఫ్లోరిడా

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

"జానీ, జానీ" అంటూ గట్టిగా పిలిచాడు ఇంట్లోకి అడుగు పెడుతూనే రామం.

"ఏదన్నా తప్పు చేసినప్పుడు జానకిని ఇలాగే పిలుస్తావులే" అనుకున్నాడు అక్కడే వున్న ఆత్మ తనలో తను.

వంటింట్లో పనిలో వున్న జానకి తడి చేతులు తుడుచుకుని బయటకు వచ్చే లోపే రామం గబగబా లోపలికి వచ్చాడు. ఒక పాకెట్ ని జానకికి అందిస్తూ, "నీకొక సర్ ప్రైజ్. ఏమిటో ఇది విప్పి చూడు" అన్నాడు ఆమెను ఊరిస్తూ.

జానకి పాకెట్ విప్పి చూసింది. నోట్ల కట్టలు చాలా వున్నాయి దాంట్లో. "ఇదేమిటండి? ఇంత డబ్బు తెచ్చారేమిటి?" అంటూ ఆశ్చర్యంగా ఇంకా ఏదో అడిగేలోపు "ఆఫీసులో ఎప్పటి నుండో ఇవ్వాల్సిన బోనస్ ఇన్నాళ్ళకి ఇవాళ హఠాత్తుగా ఇచ్చేసారు" అన్నాడు రామం గబగబా.

"నీ మొహం. పేకాటలో మోసం చేసి గెల్చిన డబ్బుని బోనస్ అని నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్తున్నావు. జాగ్రత్త. నిజం నిలకడ మీద తెలిస్తే చిక్కుల్లో పడేది నువ్వే" మెల్లిగా హెచ్చరించాడు అక్కడే వున్న ఆత్మ చాటుగా, పక్కనే వున్న జానకికి వినిపించకుండా.

"ఎంతో లెక్కపెట్టలేదు కానీ చాలా ఉన్నట్లుంది. అయినా ఇలా బోనస్ ఇస్తున్నారని ఎప్పుడూ చెప్పలేదేమిటండి?" ఇంకా ఆశ్చర్యంగానే అడిగింది జానకి రామంని.

"నిజంగా ఇస్తేగా చెప్పటానికి? వెధవ అబద్ధాలూ, వీడూనూ" ఆత్మ విసుక్కున్నాడు మనసులో.

రామం జానకి మాటలు వినిపించుకోనట్లు అక్కడ నుండి బట్టలు మార్చుకోవటానికి లోపలికి వెళ్ళిపోయాడు. అతను తిరిగి వచ్చేసరికి జానకి డిన్నరు అంతా రెడీగా టేబిల్ మీద సర్ది వుంచింది. భోజనం చూసేసరికి ఆకలి గుర్తొచ్చింది రామంకి. గబగబా తినటం మొదలెట్టాడు.

"ఈ గుత్తి వంకాయ కూర చాలా బాగా కుదిరింది కదూ!" కూర మళ్లీ కలుపుకుంటూ అన్నాడు రామం.

"ఒరేయ్! బకాసురుడా! కాస్త ఆగు. బాగుందని అలా మరీ ఎక్కువగా తినకు. ఒక్కసారి ఆ పొట్టను చూసుకో" పక్క నుండి ఆత్మ మెల్లిగా ఘోష పెట్టాడు. ఇంతలో జానకి పెరుగు కోసం వంటింట్లోకి వెళ్ళింది.

"కాస్త నన్ను మనశ్శాంతిగా తిండన్నా తిననిస్తావా?" రామం ఆత్మని ఒక్క కసురు కసిరాడు.

భోజనం ముగిసాక భుక్తాయాసంతో రామంకి కళ్ళు మూతలు పడటం మొదలైంది. అతి కష్టం మీద కాస్సేపు న్యూస్ పేపర్ పట్టుకుని ఇంక ఆ తర్వాత పక్క ఎక్కేసాడు. మర్నాడు ఆదివారం కాబట్టి తీరికగా, ఆలస్యంగా లేచాడు. బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే ఆత్మ మళ్లీ గోల పెట్టాడు. "ఒరేయ్! తిండిపోతు వెధవా, ఇంక ఆపు. అసలు చాలు అన్న మాట నీకు తెలీదా? ఇంక ఇంతటితో చాలించి జిమ్‌కి బయలుదేరు. వ్యాయామం చేయటానికి వీక్ డేస్ ఎటూ వంకలు చెప్తావు. కనీసం వీకెండ్ అన్నా బద్ధకం వదిలించుకుని కాస్త ఎక్సర్ సైజ్ చేయి. జిమ్‌కి డబ్బు కట్టి కూడా వెళ్ళకపోవటానికి నీకేం మాయరోగం?" అంటూ గొంతు పెద్దది చేసి మందలించాడు.

రామంకి కోపం ముంచుకొచ్చింది. "పొద్దున్నే మొదలైందా నీ గోల? అసలింత పొద్దున్నే నాతోపాటు నువ్వు కూడా లేవాలా? ఇంకాస్తసేపు ఎక్కువ నిద్ర పోతే నీ సొమ్మేం పోయింది? పోనీ లేస్తే లేచావు, నీ పనేదో నువ్వు చూసుకోకుండా అస్తమానూ నా వెనకెందుకు పడతావు? నేను ఎక్సర్ సైజ్ చేయకుండా పొట్ట పెంచితే నీకేం నష్టం? నువ్వు ఆరోగ్యంగానే వున్నావు కదా! నా గురించి అతిగా పట్టించుకోవటం కట్టిపెట్టు" పళ్ళు కొరుకుతూ గట్టిగా కసిరాడు ఆత్మని రామం. "నువ్వు నేను అన్న తేడా ఏముంది? నీకు ఏదైనా జరిగితే ఆ బాధ నాకే కదా!" అనుకున్నాడు ఆత్మ. అయినా కాస్సేపు మౌనం వహించాడు.

"అసలు నిన్ను నా దగ్గర ఇంతసేపు ఇలా మాట్లాడనీయటం నాదే తప్పు. నాకు బుద్ధి తెలిసినప్పటినుండీ నిన్ను నా దగ్గరే వుండనిచ్చాను. నా దగ్గర స్నేహితుడి లాగా చూసాను. అసలు నీకు, నాకు తేడానే లేదనుకున్నాను. కాని అస్తమానూ నువ్వు నన్ను ఏదో రకంగా విమర్శిస్తూనే వున్నావు. ఇలా అయితే నువ్వు నా దగ్గర వుండక్కరలేదు. నా దగ్గర నుండి వెళ్ళిపో. అసలు నాలో అన్నీ తప్పులే తప్ప ఎప్పుడూ మంచే నీకు కనిపించదా?" వూర్కోలేక మళ్లీ రామమే అన్నాడు కోపం, బాధ కలగలిపిన గొంతుతో.

"అలా ఎందుకు అనుకుంటున్నావు? మొన్న బస్సులో నీ సీటు ఒక ముసలావిడకి ఇచ్చి నువ్వు నిలబడి ప్రయాణం చేసినపుడు నిన్ను మెచ్చుకున్నాను కదా!" అన్నాడు ఆత్మ అనునయంగా.

"అఘోరించావు. అది ఎప్పుడో, ఏమో! నీ పొగడ్తల కంటే నీ తిట్లే ఎక్కువగా గుర్తు వున్నాయి నాకు. అసలు నాకు బుద్ధి తెలిసినప్పటి నుండి నీ తీరు ఇలాగే వుంది. చిన్నప్పుడు ఐదో క్లాసులో నా వెనక బెంచి అమ్మాయి నత్తితో తమాషాగా మాట్లాడుతోందని అన్నానని ఆ అమ్మాయి ముందే నన్ను చివాట్లు వేసావు. ఏదో, చిన్నతనం, తెలిసీ తెలియని అజ్ఞానం అని వదిలావా నన్ను? సరే, ఇంక కాలేజ్ లో ఏ అమ్మాయినన్నా, ఏ ఆడ లెక్చరరు నన్నా ఏడిపిస్తూ పొరపాటున ఏదన్నా అంటే చాలు, కుర్రతనం అని, ఏదో పోనిలే అని నన్నేమన్నా వదిలేవాడివా? చెడామడా నా మీద తిట్ల వర్షాన్ని కురిపించేవాడివి. సరే, పరీక్షలలో ఎప్పుడన్నా కాపీ చేస్తోంటే ఇంక చెప్పనే అక్కరలేదు. ఆ

టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల కంటే ఎక్కువగా నామీద ఇన్విజిలేషన్స్ నువ్వు చేసేవాడివి. కాలేజ్ క్లాసులు ఎగ్గొట్టి సినిమాలకి వెళ్తే ఇంక పక్క నుంచి నీ నస భరించశక్యంగా వుండేది కాదు. అసలివన్నీ చేయని కాలేజ్ లైఫ్ లో ఇంక పస ఏముంటుంది? అబ్బ, అప్పటి నుండి నిన్నెలా భరిస్తున్నానో ఆలోచిస్తే నాకే ఆశ్చర్యంగా వుంది. నాకు ఇంత సహనం ఎలా వచ్చిందా అనుకుంటున్నాను. అనుక్షణం నన్ను వెంటాడుతూ నన్ను సతాయిస్తావు. నన్ను వదిలి పొమ్మంటే పోవు. అసలు నిన్ను ఒక స్నేహితుడిలాగా చూడటం నాదే తప్పు. నువ్వు మిత్రుడివి కాదు, ఒక శత్రువువి, నా బద్ధ శత్రువువి" కక్షగా అన్నాడు రామం.

"జబ్బు చేసిన రోగికి చేదు మందు ఎలా నచ్చుతుందిలే" అన్నాడు ఆత్మ తను చేస్తున్న దాంట్లో తప్పేమీ లేదన్నట్లు, ధైర్యంగా.

"ఏమండీ, ఎంత పిలిచినా పలకరేమిటండి? ఏం చేస్తున్నారు ఆ గదిలో ఇందాకట్నుంచి? ఒక్కసారి ఇలా రండి" జానకి పిలిచింది.

ఆత్మతో ఘర్షణ పడుతున్న రామం బయటికి వచ్చాడు.

"కాస్త సాయం చేయండి. ఈ మంచం ఆ రూములోకి మార్చాలి" అంది జానకి.

"ఇప్పుడు ఎందుకు ఈ మార్పులన్నీ?" అన్నాడు మంచాన్ని ఒక వైపు పట్టుకుంటూ రామం.

ఆత్మ మౌనంగా అంతా గమనిస్తున్నాడు.

"ఎందుకేమిటండి? మా నాన్న రేపేగా వస్తారు? ఈ మంచం అయితే విశాలంగా ఆయనకు బాగుంటుంది" అంది జానకి మంచాన్ని ఇంకో వైపు పట్టుకుంటూ. అప్పుడు గుర్తొచ్చింది రామం కి మామగారు వాళ్ళింటికి వచ్చేది ఆ మర్నాడే అని. అత్తగారు పోయిన తర్వాత మామగారు బావమరిది ఇంట్లో, తమింట్లో అటు ఇటు వస్తు పోతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

"మొన్ననేగా తమింటి నుండి బావమరిది ఇంటికి వెళ్ళారు? అప్పుడే మళ్ళీ వచ్చేస్తున్నారా ఇక్కడికి?" అనుకున్నాడు మనసులో విసుగ్గా.

"ఒరేయ్ ఛండాలుడా! నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలిదనుకోకు. రెండు వారాల క్రితం వరకు జానకి ఎంత బాగా మీ అమ్మనాన్నలకు సేవ చేసిందో, ఎంత మర్యాదగా మీ అన్న గారింటికి పంపించిందో మర్చిపోయావా? మీ అమ్మానాన్నలకి తను అంత గౌరవ మర్యాదలు ఇస్తుంటే వాళ్ళ నాన్నకి నువ్విచ్చే గౌరవం ఇదా? సిగ్గు పడాలి ఇలాంటి తేడాలు చూపిస్తున్నందుకు. మామగారి బాధ్యత ఆమాత్రం కూడా వహించలేవా? ఈపాటికే నీ బంగారం అంతా కరిగిపోతుందా?" అసహ్యించుకుంటూ అన్నాడు ఆత్మ రామం ని కసురుకుంటూ.

"బాబూ! నీకు దణ్ణం పెడతాను. మనసులోని మాటలు ఇంకా పెదవుల మీదకి రాకముందే వూహించగల నీ దివ్యశక్తికి నా జోహార్లు. తప్పయిపోయింది కానీ ఇంక నీ తిట్ల పుస్తకం ఇప్పుడు విప్పకు. ఇంతటితో నన్ను వదిలేయి" చేతులు జోడిస్తూ అన్నాడు రామం. "నా ఖర్మ. నిన్ను ఎలా వదిలించుకోవాలో తెలియటంలేదు. ఎంత స్నేహితుడు అయితే మాత్రం మరీ ఇంత చనువా?" విసుగ్గా మనసులో అనుకున్నాడు రామం. ఇంక అంతకు మించి ఏమైనా ఎక్కువగా అనుకోవటానికి కూడా భయం వేసింది, మళ్ళీ దానికి ఏం తిట్లు తినాల్సి వస్తుందో అని. "అసలే ఈ ఆత్మ గాడు ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టగల సమర్థుడు" అనుకున్నాడు జంకుగా. ఆత్మ ముసిముసిగా నవ్వుకున్నాడు.

మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాస్సేపు నడుం వాలుద్దామని అనుకుంటూ వుంటే హాల్లో టేబిల్ మీద ఏదో పెద్ద పాకెట్ కనిపించింది. ఏమిటో అని విప్పి చూస్తే లోపల ఏదో చీర వుంది. దానికి ఇంకా వేలాడుతున్న సిల్క్ పాలస్ లేబిల్, చీర మడతలలో జాగ్రత్తగా దాచిన బిల్లు చూస్తుంటే అది ఇంకా మడతన్నావిప్పని సరికొత్త చీర అని ఎవ్వరు చెప్పకనే తెలుస్తోంది. అప్రయత్నంగానే బిల్లుని పరిశీలనగా చూసాడు. "ఓహో, నిన్ననే కొన్నదన్నమాట" అనుకున్నాడు మనసులో బిల్లు మీద తేదీని చూసి. కానీ చీర ఖరీదుని చూసి ఒక్కసారి వులిక్కిపడ్డాడు. "జానకి" అంటూ పిలిచాడు అప్రయత్నంగా. వంటింట్లో గిన్నెలు సద్దుకుంటున్న జానకి గబగబా పరిగెత్తుకు వచ్చింది, "అదేమిటండి, అంత పెద్దగా అరిచారు?" అంటూ. రామం చేతిలో చీర చూసి "ఈ చీర గురించి అడగటానికా పిలిచారు? నిన్ననే కొన్నాను, బాగుందా?" అంది వెంటనే.

"ఆ. ఆ. చీర బాగానే వుంది. కానీ ఆ ధరనే బాగాలేదు" అన్నాడు సహనం తెచ్చిపెట్టుకుంటూ.

జానకి ఒక్కసారి బిత్తరపోయింది. "నా పుట్టిన రోజుకి చీర కొనటానికి మీకు టైము లేదని నన్నే కొనుక్కోమని అన్నారని....." మెల్లిగా ఇంకా ఏదో అనబోతున్న జానకిని మాట పూర్తి చేయనివ్వకుండా మధ్యలోనే ఆపేస్తూ, "నిన్ను కొనుక్కోమని అన్నాను కానీ మన బడ్జెట్ ని మరచిపోమని అనలేదు" అన్నాడు రామం టక్కున. తెలీకుండానే అతని గొంతులో కరకుతనం ధ్వనించింది. "మర్చిపోలేదండీ. మనం బడ్జెట్ ని ఎంత strict గా పాటిద్దామని అనుకున్నా ఒకొక్కసారి కొంచెం అటు ఇటు అవుతుంది. ఎందుకంటే ధర తో పాటు చీర నచ్చటం కూడా ముఖ్యం కదా! ధర ఎక్కువగా వుందని మీకంత చికాకుగా వుంటే, పోనీ, చీర తిరిగి ఇచ్చేస్తానులెండి. ఆ షాపు వాళ్ళు తెలిసినవాళ్ళేగా! తీసుకుంటారు" అంది చిన్నబుచ్చుకుంటూ.

"నా ఉద్దేశం అది కాదు. అలా మనసు చిన్నబుచ్చుకోకు. చీర తిరిగి ఏమీ ఇవ్వనక్కరలేదు. ఖరీదు కొంచెం ఎక్కువగా వుందని అన్నాను అంతే" అని రామం ఏమీ అనలేదు. కోపంగా ముఖం పెట్టాడు. జానకి అక్కడ నుండి వెళ్ళిపోయింది. దానికోసమే ఎదురు చూస్తున్న ఆత్మ ఒక్కసారి విరుచుకు పడ్డాడు రామం మీద. "ఒరేయ్, పాపాత్ముడా! నీకు కొంచెం అన్నా బుద్ధుందా? పుట్టిన రోజని కట్టుకున్న పెళ్ళాం ముచ్చటపడి ఒక్క చీర కొనుక్కుంటే దానికింత రాద్ధాంతం చేస్తావా? చీర తిరిగి ఇచ్చేయమని అంటావా? అసలు నీ అంతట నువ్వు పెద్ద చీర కొని పెట్టాల్సింది పోయి పాపం, తనే ఏదో కొనుక్కుంటే దానికి ఖరీదు ఎక్కువని వంకలు పెడతావా? ఆమాత్రం అన్నా ఖర్చు పెట్టలేనంత దరిద్రం ఏమొచ్చింది? ఇంత పిసినారిగా వుండి దాచిపెట్టింది ఎవరికివ్వాలని? ఛీ, నీకు కొంచెం కూడా సిగ్గు లేదు, ఇంక ఈ జన్మకు రాదు కూడాను" ఊపిరి తీసుకోవటానికి ఆత్మ కొంచెం ఆగాడు.

రామం ఆత్మ వైపు కొరకొరా చూసాడు. "చాలీ చాలని ఈ జీతాలతో ఇంకా దాచటం కూడాను. నీ పుణ్యమా అని ఈ జీవితానికి ఇంక ఇంతే!" కక్షగా అన్నాడు. "మధ్యలో నేనేం చేశాను?" అమాయకంగా అడుగుతున్న ఆత్మను కోపంగా మధ్యలోనే ఆపేసాడు రామం. "ఏం చేసావా? మర్చిపోయావనుకుంటాను. గుర్తు చేయనా? సినిమా హీరో అవ్వాలని చిన్నప్పటి నుండి ఎంత కోరుకున్నానో! పేరుకి పేరు, డబ్బుకి డబ్బు, దేనికీ లోటు లేని జీవితం, ఎంత బాగుండేదో! నా కోరికకి అడుగడుగునా అడ్డంకులు చెప్పావు. ఈ సంగతి ఎత్తినప్పుడల్లా నన్ను నిరుత్సాహపరచి నా మీద చన్నీళ్ళు కుమ్మరించేవాడివి. నీ రూపం చూసుకో, నీ ఒడ్డు పొడుగు చూసుకో, నీ మాట్లాడే తీరు చూసుకో, అది చూసుకో, ఇది చూసుకో అంటూ నటించటం సంగతి నేను అనుకున్నప్పుడల్లా నా ప్రాణాలు తోడేసేవాడివి. వెనక, ముందు అన్న తేడా లేకుండా నలువైపుల నుండి ఇలా నస పెట్టి చంపుతుంటే ఇంక అ పని ఏమవుతుంది?" ఉక్రోషంగా అంటున్న రామంని చూస్తే ఆత్మకి నవ్వాగలేదు.

"ఆడలేని ఆడది మద్దెల ఓడందిట. అలా వుంది నీ వరస. నటించటం నీకు చేతకాక ఆ విషయం ఎత్తి చూపించానన్న కోపంతో మధ్య నన్ను అంటావేమిటి? అసలు నేను అన్నానని కాదు కానీ కొంచెం శాంతంగా ఆలోచించు. సినిమా హీరో అంటే ఎలా వుండాలి? ఆ రూపం నీకెక్కడిది? సినిమా నటులు రాత్రింబగళ్ళు ఎంత కష్టపడతారు? అంత శ్రమ నువ్వు పడగలవా? ఉత్తగా కబుర్లు చెప్తున్నావు కానీ అసలు నటన అంటే నీకేం తెలుసు? లేనిది వున్నట్లు చూపటం ఎంత కష్టం? అంతెందుకు? ఇప్పుడు నామీద వున్న కోపాన్ని దాచిపెట్టి, ఏదీ, ఒక్కసారి నవ్వు చూస్తాను" నవ్వుతూ అంటున్న ఆత్మని చూస్తే రామంకి కోపంతో ఒళ్ళు మండిపోయింది. అసలే చికాకుగా వున్నాడు. అందులో ఆత్మ ఈ వెటకారం మాటలు అగ్నిలో ఆజ్యం పోసినట్లు అతని కోపాన్ని ఇంకా భగ్గుమనేట్లు చేసాయి. నీతో మాట్లాడటం సమయాన్ని వృధా చేయటమే అనుకుంటూ, ఇంకా ఏదో అనబోతున్న ఆత్మ నోరు మూత పడేలాగా రామం బెడ్ రూమ్‌లోకి వెళ్లి మౌనంగా పక్క ఎక్కి పడుకున్నాడు. నిండా ముసుగు పెట్టేసాడు. కానీ ఎందుకో అతనికి ఆదమరచి నిద్ర పట్టలేదు. తొందరగానే లేచేసాడు. హాల్లోకి వచ్చి చూస్తే జానకి ఉతికిన బట్టలని మడతలు పెట్టుకుంటూ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతోంది. అక్కడే ఒక సోఫాలో కూర్చుని ఓరగా జానకి వైపు చూసాడు రామం. "ఫరవాలేదు. ముఖం చూస్తే కోపంగా ఉన్నట్లుగా ఏమీ లేదు. అమ్మయ్య, బతికాను" అనుకున్నాడు రిలీఫ్ గా.

జానకి మాటలు ఎంతకీ అవటంలేదు. ఆమె సంభాషణ దుర్గాదేవిగారితో అని అర్థం అయింది రామంకి. విసుగ్గా వుంది అతనికి. బాగా గడసరి అని, రాక్షసితనంతో మొగుడిని ఒక ఆట ఆడిస్తుందని రామంకి ఆ దుర్గాదేవి అంటే అస్సలు పడదు. ఆవిడతో ఎక్కువ స్నేహంగా వుంటే ఆ గుణాలు జానకికి ఎక్కడ వంట పడతాయేమోనని అతని భయం.

"ఓ పిరికివాడా! అలా అనవసరంగా భయపడకు. కట్టుకున్న పెళ్ళాం తెలివిని కాస్త గౌరవించటం నేర్చుకో. మాట మాట్లాడినంత మాత్రానే వాళ్ళ గుణాలేవి మనకు అంటవు. నీ అవివేకాన్ని కాస్త కట్టిపెట్టి కొంచెం కళ్ళు తెరు" పక్కనే ఆత్మ మెత్తగా వేస్తున్న చివాట్లు వినిపిస్తున్నాయి రామంకి.

ఫోనులో మాట్లాడటం అయిపోయిన తర్వాత మడిచిన బట్టలని బీరువాలో పెట్టటానికి ఒక బొత్తిగా పట్టుకుంటూ లేచింది జానకి. "లేచారా? కాఫీ ఇవ్వనా? ఇవాళ ఎక్కువసేపు పడుకున్నట్లు లేదే!" అంది రామంని చూసి. రామంకి ఒక్కసారి ఎందుకో తప్పు చేసినట్లు సిగ్గుగా అనిపించింది జానకి ప్రశాంతమైన ముఖం చూస్తుంటే. ఏ కోపతాపాలు, నస లేకుండా ప్రేమగా ఆమె మాట్లాడుతుంటే తను చూపించిన కోపం, చికాకు గుర్తొచ్చి ఏదోలా అనిపించింది అతనికి. "జానీ, తొందరగా తయారవు. ఏదన్నా సినిమాకి వెళదాం. ఆ తర్వాత బయటే తినేద్దాం. పద, చప్పున రావాలి మరి" అన్నాడు హుషారుగా, మనస్ఫూర్తిగా. ఆత్మ మెచ్చుకోలుగా చూసాడు రామం వైపు.

జానకి నవ్వుతూ "శ్రీవారికి హఠాత్తుగా సినిమా మీద ధ్యాస ఎందుకు పోయిందో! ఇదంతా నా చింత చిగురు పప్పు మహత్యమా?" అంది రామంతో. గబగబా తయారై ఇద్దరూ సినిమాకి బయలుదేరారు. సినిమా అయిన తర్వాత హోటల్ లో భోజనం చేసి ఇంటికి చేరేసరికి బాగా ఆలస్యం అయింది.

"ఏమండీ! ఈసారి మా నాన్నతో పాటు నేను కూడా వెళ్ళనా మా అన్నయ్య దగ్గరికి?" బట్టలు మార్చుకుని పడుకోవటానికి సిద్ధం అవుతూ మెల్లిగా అడిగింది జానకి రామంని. "ఎందుకు?" చటుక్కున అడిగాడు రామం, ఎందుకిప్పుడు అనవసరంగా అన్న అర్థం వచ్చేలాగా.

"ఎందుకేమిటండి? మా వదినకి సర్జరీ అయినప్పుడు కూడా వీలు కాక నేను వెళ్ళలేకపోయాను. ఒక్కసారి వెళ్లి చూసి వస్తాను. పాపం, ఎలా వుందో, ఏమిటో" బెంగగా అంది జానకి.

రామంకి ఏమనాలో తెలీలేదు. మంచినీళ్ళు తాగే నెపంతో అక్కడినుండి వంటింట్లోకి వచ్చాడు. అంతే! ఆత్మ తగులుకున్నాడు రామాన్ని"ఒరేయ్! అడ్డగాడిదా!" అంటూ. ఆత్మ ఏదో పెద్ద లెక్చరు ఇవ్వబోతున్నాడని రామంకి తెలిసిపోయింది. "అబ్బ, వదులు నన్ను. నిద్ర వస్తోంది. పడుకోవాలి ఇంక" అంటూ విదిలించుకోబోయాడు.

“నిద్రా? నిద్రెలా వస్తుంది నీకు?" కోపంగా అరిచాడు ఆత్మ.

"ఏం? ఎందుకు రాకూడదు? నేను మనిషిని కానా? అయినా అసలు మనశ్శాంతిగా నన్ను నిద్ర కూడా పోనీవా? ఇలా జిడ్డు లాగా నన్నెందుకు వేధిస్తున్నావు? అయినా అంత నిద్ర కూడా పోకూడని మహాపరాధం ఏం చేసాను నేను?" విసుగ్గా అన్నాడు రామం.

"ఏం చేసానని నన్నడుగుతున్నావా? అసలు మనసు అన్నదేది లేదా నీలో? ఆమధ్య నీకు అపెండిసైటిస్ ఆపరేషన్ అయితే జానకి వాళ్ళ వదిన మీ ఇంటికొచ్చి మీ అందరికి అనేక సేవలు చేసింది. నీ తోబుట్టువు లాగా మసిలింది. అలాంటి ఆవిడకి, పాపం, వంట్లో బాగుండక ఏదో సర్జరీ అయితే నీ అంతట నువ్వు జానకిని సహాయం కోసం పంపడం మానేసి, తనే వెళ్తానని నోరు విప్పి అడిగితే ఎందుకు అంటూ చెత్త ప్రశ్నలడుగుతావా? వెళ్ళు అని సంతోషంగా పంపడానికి సందేహిస్తావా? అసలు బుద్ధంటూ వుందా నీకు? కృతఘ్నుడు, స్వార్థపరుడు, ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసే దుర్మార్గుడు, ఏమనాలి నిన్ను?" కోపంగా ఇంకా ఏదో అనబోతున్న ఆత్మను మధ్యలోనే ఆపేసాడు రామం. తన చేతులతో రెండు చెవులను మూసుకుంటూ "బాబోయ్, ఇంక ఆపు. సమయం, సందర్భం కూడా లేదు నీకు. అర్థరాత్రి వేళ ఏమిటి నీ గోల? నిశాచరుడివి కాబట్టి నీకు రాత్రి వేళ ఎటూ నిద్ర అన్నది రాదు. కనీసం మమ్మల్ని అన్నా నిద్ర పోనిస్తావా? లేదా? అయినా ఇంక నువ్వసలు నన్ను వదలవా? అస్తమానూ నన్ను నీడ లాగా వెంటాడటానికి రాత్రి, పగలు అన్న తేడా కూడా లేదా నీకు? అసలు ఇదొక్కటేనా నీకు పని? నాకేమి అక్కరలేదు నీ నీతిబోధలు. పో, ఇక్కడి నుంచి" కోపంగా అన్నాడు రామం. సమయాసమయాలు లేకుండా అస్తమానూ ఏమిటి ఈ ఉపదేశాలు అనుకున్నాడు పళ్ళు నూరుకుంటూ మనసులో.

"వదలను. ఇష్టమున్నప్పుడు వెంట ఉండటానికి, ఇష్టం లేనప్పుడు వదిలేసి పారిపోవటానికి నేను అందరిలాంటివాడిని కాను. అసలు నేనెవరని అనుకుంటున్నావు? స్వయానా నీ ఆత్మని నేను. నేను, నువ్వు అన్న తేడాలేమీ లేని నీ అంతరాత్మని నేను. రాత్రి పగలు, అప్పుడు ఇప్పుడు, అటు ఇటు, వెనక ముందు అన్న తేడాలేవీ లేకుండా అనుక్షణం నీలోనే దాగివుండే నీ మనస్సాక్షిని. అర్థమైందా? నీకు నచ్చుతుందని అడ్డమైన ఇచ్చకాలు ఆడటానికి, నీకు నచ్చదని నువ్వు తప్పులు చేస్తున్నా కూడా నిన్ను సవరించకుండా అలా వదిలేయటానికి నేను నీ మంచి కోరనివాడిని కాదు. నిన్ను నయాన్నో, భయాన్నో మంచి మార్గం లోనికి పెట్టడానికి కనీసం ప్రయత్నమన్నా చేయకుండా ఉండటానికి నేనేమీ నీకు పరాయివాడిని కాదు. చాలామంది లాగా స్వార్థపరుడిని కాదు. నిజాయితిగా ఉన్నదున్నట్లు చెప్పి, అప్రియమైనా సరే, ఎలాగో అలాగ నిన్ను సరైన దారిలోకి లాగటమే నా ముఖ్యోద్దేశం. అందుకే నువ్వు తప్పు చేస్తున్నప్పుడల్లా నీకెంత ఇష్టం లేకపోయినా, నువ్వెంత విసుక్కుంటున్నా నేనెప్పుడూ నిన్ను మందలించేవాడిని. హెచ్చరించేవాడిని. ఎందుకంటే అలా చేయటం అంతరాత్మగా నా కర్తవ్యం. పెడచెవిని పెడితే నీ ఖర్మ. అలా అని నువ్వు తప్పు చేస్తున్నా కూడా నిన్ను ఏమీ అనకుండా మౌనంగా వుండటం నా వల్ల కాదు. అందుకే......." తన వాగ్ధాటిని కొంచెం ఆపి రామం వైపు చూసాడు ఆత్మ. రామం విసుగ్గా ముఖం పెట్టి, రెండు చేతులు జోడించి ఆత్మకి ఒక దణ్ణం పెట్టి బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. జానకి ఆదమరచి నిద్ర పోతూ కనిపించింది. తను కూడా పక్క మీదకు ఒరిగాడు.

దుప్పటి నిండా కప్పుకుని నిద్రకి ఉపక్రమించాడు.

నీ సంగతి నాకు తెలుసులే, మనిద్దరికీ ఇది ఎప్పుడూ జరిగే యుద్ధమేగా అన్నట్లు ఆత్మ తనలో తను నవ్వుకున్నాడు.

COMMENTS